నేడు రమ్యాగ్రౌండ్‌లో తులసి మొక్కల పంపిణీ

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని రమ్యాగ్రౌండ్ వినాయక మండపం వద్ద శుక్రవారం మహిళలకు ఉచితంగా తులసి మొక్కలు పంపిణీ చేయనున్నట్టు శివశక్తి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా నరసింగరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు మావుటూరు షణ్ముఖశర్మ పూజా కార్యక్రమాలు, 11.30 గంటలకు తులసి మొక్కల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. దాతలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

జంట సర్కిళ్ల ప్రాజెక్టు అధికారులుగా ఉమా, భోగీశ్వర్లు


ఉమా


భోగీశ్వర్లు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల యూసీడీ (అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్) ప్రాజెక్టు అధికారులుగా జంధ్యాల ఉమా, భోగీశ్వర్లు నియమితులయ్యారు. సదాశివపేట్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జంధ్యాల ఉమా బదిలీపై మూసాపేట్‌కు, నారాయణపేట మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న భోగీశ్వర్లు కూకట్‌పల్లికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రాజశేఖర్ యూసూఫ్‌గూడ, ఇంద్రసేన మెహిదీపట్నం సర్కిళ్లకు బదిలీపై వెళ్లారు.

ఉపాధ్యాయులుగా విద్యార్థులు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం వార్షిక ఫలితాల్లో టాపర్‌గా నిలిచిన ద్వితీయ సంవత్సరం విద్యార్థి జ్యోతి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా.. ఇతర విద్యార్థులు అధ్యాపకులుగా వ్యవహరించారు. అత్యుత్తమ బోధన కనబరిచిన వారికి ప్రిన్సిపాల్ వెంకటయ్య అభినందించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.


లులు మాల్‌లో పూల రంగోలి వేస్తున్న సందర్శకులు, సిబ్బంది

లులు మాల్‌లో ఓనం వేడుకలు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లులు మాల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఓనం వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఓనం వేడుకల్లో భాగంగా మాల్‌కు వచ్చిన సందర్శకులు, సిబ్బంది పూల రంగోలిలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల పూలతో అందంగా తీర్చిదిద్దారు. అనంతరం నిర్వాహకులు విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. శుక్రవారం వడంనాలి, మావెలి గ్రీట్ అండ్ మీట్, సింగారి మేళ ఉంటుందని మాల్ మేనేజర్ ఎడిల్ అరసన్ తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరు ఎంపిక

హైదర్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరు ఎంపికయ్యారు. ఇంగ్లిష్ బోధనలో ఉత్తమ ఫలితాలు సాధించిన రిక్షాపుల్లర్స్ కాలనీ ప్రభుత్వ పాఠశాలకు చెందిన బిజ్జం రాజిరెడ్డి, వెంకటేశ్వరనగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన గోవు నీమ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని వారు తెలిపారు.

ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న శృంగేరీ శంకర మఠం

అల్లాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మోతీనగర్ స్థిత శృంగేరీ శ్రీ శారదా శంకర మఠంలో ఐదు రోజులుగా శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞ మహోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం జరిగిన శలాక రఘునాథశర్మ ప్రవచనానికి భక్తులు ముగ్ధులయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని మఠం ప్రతినిధులు తెలిపారు.

కేబుల్ వైర్లు తొలగించండి



అల్లాపూర్ డివిజన్‌లో అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలపై ఉన్న ఇంటర్నెట్, టీవీ కేబుళ్లను జీహెచ్ఎంసీ సిబ్బంది కట్ చేసి రోడ్డుపైనే వదిలేశారు. రెండు వారాలు గడుస్తున్నా వాటిని తొలగించలేదు. ఏదైనా ప్రమాదం సంభవించక ముందే సంబంధిత అధికారులు స్పందించి వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- అల్లాపూర్, (ఆంధ్రజ్యోతి)

యువత వ్యాయామంపై దృష్టి సారించాలి : సీఐ

నిజాంపేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యువత వ్యాయామంపై దృష్టి సారించి, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ శరీర దృఢత్వాన్ని స్థిర పరుచుకోవాలని బాచుపల్లి సీఐ సతీష్‌కుమార్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి హరితవనం కాలనీలో ఏర్పాటు చేసిన ఐరన్ డీస్ట్ వ్యాయామశాలను గురువారం ప్రారంభించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ జిమ్ లైఫ్ దిశగా సాగుతున్నారని అన్నారు.


వెంకటపాపయ్యనగర్‌లో గణపతి పూజలో పాల్గొన్న టూరిజం డెవలప్‌మెంట్ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి


పాపరాయుడునగర్‌లో వినాయక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


కూకట్‌పల్లిలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ


ఆస్‌బెస్టాస్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడి పూజలో పాల్గొన్న టీం విఘ్నహర్త యూత్ సభ్యులు

దేవాది దేవ.. గణపతి దేవా!

పలు డివిజన్‌లలో ఉత్సవాలు.. అన్నదానాలు

కూకట్‌పల్లి జోన్ బృందం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలు కూకట్‌పల్లి నియోజకవర్గంలో వైభవంగా కొనసాగుతున్నాయి. వినాయక మండపాల్లో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్నారు. కూకట్‌పల్లి వినాయక యూత్ అసోసియేషన్ సభ్యులు రకరకాల ప్రసాదాలు భక్తులకు అందిస్తున్నారు. అలాగే, కూకట్‌పల్లి డివిజన్‌లోని పలు వినాయక మండపాల్లో గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అల్లాపూర్ డివిజన్‌లోని గాయత్రినగర్ 60ఫీట్ల రోడ్డులో కాలనీ సంక్షేమ సంఘం, కాలనీ ఉత్సవ కమిటీలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన మండపంలో రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, దొడ్ల వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్‌కుమార్, ఓసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి టూరిజం డెవలప్‌మెంట్ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రమ్యాగ్రౌండ్‌లో కూచిపూడి నృత్యప్రదర్శన చేసిన చిన్నారులతో కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు రంగస్వామి


గాయత్రినగర్‌లోని వినాయక మండపంలో శాస్త్రీయ నృత్యం ప్రదర్శించిన చిన్నారులు


బాలానగర్‌లో గణనాథుడి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి


అల్లాపూర్: శివశక్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూజలందుకుంటున్న గణనాథుడు


ఎస్పీనగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నం వడ్డిస్తున్న కాంగ్రెస్ నేత సత్యంశ్రీరంగం


రాజీవ్‌గాంధీ నగర్‌లో గణనాథుడిని దర్శించుకున్న బీజేపీ సీనియర్ నేత అమరేశ్ రాజా

వెరైటీ గణేశా..

కార్టూన్ గణేశ్



కూకట్‌పల్లి వెంకట్రావు నగర్‌లో టీం బ్లాక్‌లిస్ట్ సభ్యులు ఏర్పాటు చేసిన కార్టూన్ గణేశ్ అందరిని ఆకట్టుకుంటుంది.

ఆపరేషన్ సిందూర్



ఆపరేషన్ సిందూర్‌ను ప్రతిబింబించేలా కూకట్‌పల్లిలోని శాంతినగర్‌లో టీం చతుర్భుజ్ వారు ఏర్పాటు చేసిన వినాయక మండపం అందరినీ ఆకట్టుకుంటుంది.


శివశంకర్‌నగర్‌లో లంబోదరుడిని దర్శించుకున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్


ఎల్లమ్మబండలో సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి జ్ఞాపికలు అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్


వి.రామారావునగర్‌లో వినాయకుడిని దర్శించుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాఘవేంద్ర


లంబోదరుడి పూజలో పాల్గొన్న ఓసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి


ఎస్ఎస్‌జీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి పూజలో పాల్గొన్న కాంగ్రెస్ నేత సతీష్‌రెడ్డి


మట్టి గణపతితో మహిళలు

కాంగ్రెస్ పాలనలో కుంటుపడిన అభివృద్ధి

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

బాలానగర్/ఓల్డుబోయినపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపించారు. బోయిన్‌చెరువు కట్టమైసమ్మ ఆలయం నుంచి హస్మత్‌పేట డంప్ యార్డు వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను కార్పొరేటర్ నర్సింహ యాదవ్‌తో కలిసి గురువారం ఎమ్మెల్యే పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఓల్డుబోయినపల్లి హస్మత్‌పేట బోయిన్‌చెరువును అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతానని ప్రజలకు హామీనిచ్చారు. కోటి రూపాయలతో చేపట్టబోతున్న సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే అంజయ్యనగర్ వైపుకు వెళ్లే ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరైనప్పటికి పనుల్లో జాప్యం నెలకొంటుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం శ్రీశ్రీనగర్‌లో రూ.20లక్షలు, ఇందిరానగర్‌లో రూ.55 లక్షలతో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ పనులకు కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జంగయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీశ్రీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గేష్, ఇందిరానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరిసాగర్, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సీసీరోడ్డు నిర్మాణపనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్ సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. అన్నివేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటానని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు, నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలో వాటర్ హెడ్ ఆఫ్ ఇండియా సంస్థ వారి సౌజన్యంతో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను గురువారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాటర్‌హెడ్‌ఆఫ్ ఇండియా సేవలను కొనియాడారు. ఇదే విధంగా ప్రతిఒక్కరూ సామాజిక హితం కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు



కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమాటా 27, వంకాయ 40, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, కాకరకాయ 32, బీరకాయ 35, క్యాబేజీ 15, బీన్స్ 45, క్యారెట్ 41, గోబిపువ్వు 25, దొండకాయ 35, చిక్కుడు కాయ 50, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 23, క్యాప్సికం 50, ఆలుగడ్డ 23, కీర 18, దోసకాయ 18, సొరకాయ 20, పొట్లకాయ 23, కంద 40, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 24, మామిడికాయ 15-20, అరటికాయ 10-12, చామగడ్డ 23, ముల్లంగి 6-8, చిలగడదుంప 40, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 20-24, మునగకాయలు 6-8, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 120, వెల్లుల్లి 160, చింతపండు 160, పండుమిర్చి 80, ఉసిరి 115, కరివేపాకు 60, పర్వల్ రూ.60, పల్లికాయ 60, లోబా 23, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు శుక్రవారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

హైదర్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట రోడ్ శ్రీనివాసకాలనీకి చెందిన బాల తిమ్మారెడ్డి(56) డయల్ కాల్స్ ద్వారా డోర్ స్టెప్ కంప్యూటర్ సర్వీసెస్ సేల్స్ పర్సన్‌గా పనిచేస్తున్నాడు. కాగా అతడు ఈ నెల 3న ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలతిమ్మారెడ్డి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది.

జీడిమెట్లలో..

జీడిమెట్ల సుభాష్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి తన స్నేహితుడిని కలవడానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడు. ఈ నెల 3న రమేశ్ తన స్నేహితుని ఇంటికి వెళ్తున్నాని చెప్పి ఇంటికి రాలేదు. రాత్రి పది గంటల సమయంలో తన సోదరుడికి తన ఆటో, మొబైల్‌ను కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్ 1లో వదిలి వెళ్తున్నానని, తన కోసం వెతకవద్దని వాయిస్ మెసేజ్ పంపించాడు. వెంటనే రమేశ్ కుటుంబ సభ్యులు కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నిమజ్జనానికి అంతా రెడీ

- రేపు గంగమ్మ ఒడికి గణనాథులు
- కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్ వద్ద ఏర్పాట్లు పూర్తి
- నేడు, రేపు ట్రాఫిక్ ఆంక్షలు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నవరాత్రులు పూజలందుకున్న ఏకదంతుడు గంగమ్మ ఒడికి చేరనున్నాడు. ఈ మేరకు శనివారం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి పిలుపు మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ వ్యాప్తంగా మహాగణపతులను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందుకు ఐడీఎల్ ట్యాంక్ (రంగదాముని చెరువు) వద్ద పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది పటిష్ఠమైన ఏర్పాటు చేయడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తున్నారు.

రేపే మహా నిమజ్జనం..

కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్‌లో పండుగ ప్రారంభం నుంచి 11వేలకు పైగా గణపతులు నిమజ్జనమయ్యాయి. గతేడాది 29వేల విగ్రహాలు నిమజ్జనం కాగా.. ఈ సారి అంతకంటే ఎక్కువ గణనాథులు నిమజ్జనమయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, జడ్సీ అపూర్వ్‌చౌహాన్, డీసీ ఇస్లావత్ సేవ, ఇంజనీరింగ్ ఎస్ఈ చిన్నారెడ్డి, ఈఈ రమేష్‌తో కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌ఓ కేవీ సుబ్బారావు, ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వో ముత్తుయాదవ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. హైదర్‌నగర్, నిజాంపేట్‌రోడ్డు, ప్రగతినగర్, కేపీహెచ్‌బీ, జేఎన్‌టీయూ పరిసర ప్రాంతాల నుంచి వచ్చే గణనాథులకు ఐడీఎల్ ట్యాంక్‌కు వెళ్లే మార్గంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి తరఫున స్వాగతం చెప్పనున్నారు. మూసాపేట్, వై జంక్షన్ పరిసర ప్రాంతాల నుంచి వచ్చే గణపయ్యలు కూడా అశోకా వన్ మాల్ వద్ద ఫ్రీ లెఫ్ట్‌తో నిమజ్జన ప్రాంతానికి చేరుకుంటాయి. ఇక కేపీహెచ్‌బీ నాలుగోఫేజ్, 15వ ఫేజ్, కైత్లాపూర్, రాఘవేంద్ర కాలనీ, సేవాలాల్ నగర్, రెయిన్ బో గేటెడ్ కమ్యూనిటీలు, మూసాపేట్ ఆంజనేయనగర్ పరిసర ప్రాంతాల నుంచి వచ్చే గణనాథులు రంగనాయక స్వామి ఆలయం వైపు నుంచి నేరుగా నిమజ్జనం జరిగే ప్రాంతానికి చేరుకోనున్నాయి.


ఐడీఎల్ ట్యాంక్ వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి (ఫైల్)

ఐదు ప్రాంతాల్లో పార్కింగ్..

కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్‌లో మహా నిమజ్జనం నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అశోకా వన్‌మాల్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, హుడా ట్రక్ పార్కింగ్, సైబర్‌సిటీ జీవోసీఎల్ సైట్, వాసవీ కన్‌స్ట్రక్షన్ రోడ్డులో వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేసినట్లు ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వో ముత్తుయాదవ్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకు ఐడీఎల్ ట్యాంక్ మార్గంలో వ్యక్తిగత వాహనాలకు అనుమతి లేదని చెప్పారు. వాహన దారులు కూడా సహకరించి వినాయక నిమజ్జన ప్రక్రియను విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని కోరారు.


ఐడీఎల్ ట్యాంక్ వద్ద వినాయకులను నిమజ్జనం చేస్తున్న సిబ్బంది


వివేకానందనగర్ డివిజన్ ఈనాడు కాలనీలో లంబోదరుడి పూజలో రాష్ట్ర ఓసీ సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, స్థానికులు


ఎల్లమ్మబండలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభచాటిన వారికి జ్ఞాపికలు అందజేస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్


ఆల్విన్‌కాలనీ వెంకటపాపయ్యనగర్‌లో గణపతి పూజల్లో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్


ఆల్విన్‌కాలనీ పంచమి కాలనీలో నిర్వహిస్తున్న పూజల్లో పాల్గొన్న జిల్లా గణేశ్ నేత, స్థానికులు తదితరులు


అన్నసంతర్పణలో పాల్గొన్న కార్పొరేటర్ సింధూ

ఓం లంబోదరాయ నమః

హైదర్‌నగర్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాలు వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్‌లో భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. వివేకానందనగర్ ఈనాడు కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడిని రాష్ట్ర ఓసీ సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆల్విన్‌కాలనీ ఎల్లమ్మబండ రాజీవ్‌గాంధీ నగర్‌లో సిద్ధివినాయక యూత్ అసోసియేషన్ వారు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ జ్ఞాపికలు అందజేశారు. ఆల్విన్‌కాలనీ వెంకటపాపయ్యనగర్‌లో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, ఆల్విన్‌కాలనీ డివిజన్ పంచమి కాలనీలో బంజార యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి సీనియర్ నాయకుడు జిల్లా గణేశ్ పూజలు చేశారు.

చందానగర్‌లో..

చందానగర్: చందానగర్ డివిజన్ గల పలు కాలనీలు, బస్తీల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు జరగగా, గురువారం సాయంత్రం ప్రతిమలను నిమజ్జనానికి భారీ బ్యాండ్‌ల నడుమ తరలించారు. సురక్ష ఎన్‌క్లేవ్‌కాలనీలో జరిగిన ఉత్సవాల్లో కార్పొరేటర్లు మంజూల రఘునాథ్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్‌లతో కలిసి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేశారు. సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కాంగ్రెస్ చందానగర్ డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, ఎంబీసీ చైర్మన్ జెర్రిపాటి జైపాల్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అంబేడ్కర్ ఎస్ఎస్‌జీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో నిర్వహించిన లడ్డూ వేలం పాటను సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఉరిటి వెంకట్రావు రూ.3,51,116లకు దక్కించుకున్నారు.

భెల్‌కాలనీలో

భెల్‌కాలనీ: భెల్ టౌన్‌షిప్ ఎంఐజీ కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాలు, దేవాలయాల్లో ప్రారంభమైన వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారంతో అన్నసమారాధనలు ముగిశాయి. అనంతరం డప్పుల సవళ్లు, నృత్యాల నడుమ నిమజ్జన ఊరేగింపులు నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, నాయకులు భాస్కర్, సంపత్ తదితరులు పూజలు చేశారు. భెల్ టౌన్‌షిప్‌లోగల వేంకటేశ్వర, యోగేశ్వర స్వామి దేవస్థానంలో గల దశావతార మండపంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. భెల్ ఎంఐజీకాలనీలోని పలు పార్కులు, మైదానాలు, ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఆయా చోట్ల పూజలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


భజరంగ్ సేనా ఆధ్వర్యంలో పూజలందుకుంటున్న గణేశుడు


ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ


ప్రత్యేక పూజల్లో బీఆర్ఎస్ పటాన్‌చెరు కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి

ముచ్చటగా మూడోసారి



ఓల్డ్ హఫీజ్‌పేట గణేశుడి లడ్డూ వేలం వేయగా టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ కనకమామిడి సురేందర్ గౌడ్ రూ.93 వేలకు లడ్డు కైవశం చేసుకున్నారు. ఇలా లడ్డూ దక్కించుకోవడం ఇది మూడవసారి.

- మియాపూర్ (ఆంధ్రజ్యోతి).


సాయినగర్‌లో శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి పూజల్లో ఎమ్మెల్యే గాంధీ


కొండాపూర్ ఆనంద్‌నగర్‌లో గణనాథుడి పూజల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చాంద్‌పాషా, కాలనీ వాసులు

హాఫీజ్‌పేటలో ప్రత్యేక పూజలు

మియాపూర్ సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో సీనియర్ నాయకుడు బాలింగ్ గౌతమ్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరు మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామన్నారు. చెరువులను కలుషితం చేయకుండా వీలైనంత వరకు మన స్వగృహం ప్రాంగణంలోనే నిమజ్జనం చేసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా..



హైటెక్ సిటీలోని మెట్రోకెమ్ ఏపీఐ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జనాన్ని ఉద్యోగులు గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. డాక్టర్ ఎన్‌వీ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు ఏడు రోజుల పాటు పూజలు అందుకున్నాడు. కార్యక్రమంలో కంపెనీ సీఓఓ హర్ష, సీఎస్ఓ హర్‌దేవ్, హెచ్‌ఆర్ హెడ్ రాజేష్, కంపెనీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి)

మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్స్‌కు నిరాదరణ

- నిర్మాణాలు సరే.. నిర్వహణేది?
- శిథిలావస్థలో మరుగుదొడ్లు, కిచెన్‌లు
- పాపిరెడ్డికాలనీలోని దుస్థితి ఇదీ..
- చందానగర్, లింగంపల్లి తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి


పాపిరెడ్డికాలనీలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్

గచ్చిబౌలి, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని పాపిరెడ్డికాలనీలో రూ.1.75కోట్లతో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మించారు. కొన్నాళ్లు పాటు సజావుగానే కొనసాగింది. తర్వాత ఈ ఫంక్షన్ హాల్ నిర్వహణ సరిగా లేక మరుగుదొడ్లు, కిచెన్ కొన్నాళ్లకే శిథిలావస్థకు చేరాయి. దీంతో శుభకార్యాలు చేసుకునే వారు ఇటు వైపు రావడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్య వైఖరి వల్లే కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఫంక్షన్‌హాల్ నిరాదరణకు గురవుతుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు పర్యవేక్షణ లేక పట్టించుకోక పోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. పేద, బడుగు వర్గాల అవసరాలకు శుభకార్యాలకు పనిచేస్తుందని భావించిన కల్యాణమండపం మూడేళ్లుగా అధ్వానంగా మారింది. కాలనీ మధ్యలో మండపం ఉండటం వల్ల పోకిరీలు ఇక్కడే తిష్టవేస్తున్నారు. అలాగే పార్కింగ్ స్థలంలో క్రికెట్ ఆడుతున్నారు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి ఈ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను వాడుకలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

- చందానగర్, లింగంపల్లి తదితర ప్రాంతాల్లో నిర్మించినపట్టికీ నిర్వహణ సరిగా లేకపోవడంతో ఇవి సైతం శిథిలావస్థకు చేరుకున్నారు. కోట్లు వెచ్చించి నిర్మించిన ఈ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

సక్రమంగా బాధ్యతలు చేపట్టాలి

కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఫంక్షన్‌హాల్స్, మల్టీపర్పస్‌లు అధికారులు నిర్మించి వదిలేస్తున్నారు. నిర్వహణ లేక పోవడంతో అతి తక్కువ కాలంలోనే అవి శిథిలావస్థకు చేరుతున్నాయి. ఇప్పటికైనా వారు నిర్వహణ బాధ్యతలు సక్రమంగా చేపట్టాలి.

-కొండల్‌రెడ్డి, పాపిరెడ్డికాలనీ



మరమ్మతులు చేయిస్తాం

నియోజవర్గవ్యాప్తంగా, చందానగర్, తారానగర్, ఓల్డ్‌ఎంఐజీ కాలనీలో ఇలాంటి ఫంక్షన్‌హాల్స్ ఉన్నాయి. మూడేళ్ల క్రితమే పాపిరెడ్డికాలనీలోనూ నిర్మించాం. అధికారులతో కలిసి ఫంక్షన్ హాల్స్ సందర్శించి కావాల్సిన మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకువస్తాం.

- ఆరెకపూడిగాంధీ, ఎమ్మెల్యే

ఉచిత వైద్యశిబిరం

హైదర్‌నగర్, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్ ఇందిరాహిల్స్‌లో కాలనీలో బెరాక ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్, ప్రతిమ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్లు వెంకటేష్‌గౌడ్, శ్రీకాంత్‌తో కలిసి ఆయన.. శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. శిబిరానికి హాజరైన వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. పాస్టర్లు ఏసుపాదం, హ్యారీస్, నాయకులు పాల్గొన్నారు.

యువత వ్యాయామంపై దృష్టి సారించాలి : సీఐ

నిజాంపేట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యువత వ్యాయామంపై దృష్టి సారించి, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ శరీర దృఢత్వాన్ని స్థిర పరుచుకోవాలని బాచుపల్లి సీఐ సతీష్‌కుమార్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి హరితవనం కాలనీలో ఏర్పాటు చేసిన ఐరన్ డీస్ట్ వ్యాయామశాలను గురువారం ప్రారంభించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ జిమ్ లైఫ్ దిశగా సాగుతున్నారని అన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్ సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. అన్నివేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటానని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు, నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలో వాటర్ హెడ్ ఆఫ్ ఇండియా సంస్థ వారి సౌజన్యంతో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను గురువారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాటర్‌హెడ్‌ఆఫ్ ఇండియా సేవలను కొనియాడారు. ఇదే విధంగా ప్రతిఒక్కరూ సామాజిక హితం కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు

గురు సాక్షాత్ పరబ్రహ్మ

- ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవాలు


ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో కొండాపూర్ సంస్కృతి పాఠశాల ఉపాధ్యాయులు

భెల్‌కాలనీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గురుసాక్షాత్ పరబ్రహ్మ అని వక్తలు అన్నారు. మాజీ ప్రథమ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను భెల్ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు ఘనంగా జరుపుకొన్నారు. జిల్లా ప్రభుత్వ పాఠశాల, జ్యోతి విద్యాలయ, గీతాంజలి పాఠశాల, భారతీయ విద్యాభవన్, సెయింట్ ఆన్స్, విద్యాభారతి పాఠశాలలకు చెందిన విద్యార్థులు.. గురువులను శాలువాలతో సన్మానించారు. భారతీయ విద్యాభవన్స్ పాఠశాలలో వేడుకలు జరిగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ ఉమా శాస్త్రి మాట్లాడుతూ విద్యతోపాటు క్రమశిక్షణను అలవర్చుకున్న విద్యార్థులే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. గురువులను, తల్లిదండ్రులను, సమాజంలోని వృద్ధులను గౌరవించినప్పుడు తాము చదివిన చదువుకు సార్థకత లభిస్తుందని హితవు పలికారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన తరువాత పేద పిల్లల విద్యార్థులకు సహాయసహకారాలు అందజేయాలని సూచించారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): సమాజంలో అత్యంత గౌరవ ప్రదమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సెంటర్ ఫర్‌హెల్త్ మాజీ అధ్యక్షులు ఆచార్య మీనా హరిహరన్ అన్నారు. గురువారం శేరిలింగంపల్లి ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శేరిలింగంపల్లి మండలంలో పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలు, డిగ్రీ, జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. తల్లిదండ్రులను, విద్య నేర్పిన గురువులను గౌరవించాల్సిన బాధ్యత ఉందని మీనా అన్నారు. గురువులు శిష్యులలో ఉన్న అజ్ఞానమనే చీకటిని పారదోలి వారి ఉజ్వల భవిష్యత్ కోసం పరితపిస్తుంటారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు విజయలక్ష్మి, అమ్మయ్యచౌదరి, వాణి, జీవీరావు, శివరామకృష్ణ, బాలాజీ, విష్ణు ప్రసాద్, ఖదార్, మొయినుద్దీన్, సత్యవాణి, వరలక్ష్మి, దర్గ తదితరులు పాల్గొన్నారు.


గచ్చిబౌలి: మాట్లాడుతున్న ఆచార్య మీనా హరిహరన్

- కొండాపూర్‌లోని సంస్కృతి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మణ్ మాట్లాడుతూ తల్లిదండ్రులను గౌరవించే ప్రతీ విద్యార్థి సమాజాన్ని కూడా గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందనగర్‌లో ..

హైదర్‌నగర్, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ ఆర్‌పీ కాలనీ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి హాజరై డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మాజీ రాష్ట్రపతి, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదన్నారు. కార్యక్రమంలో జి.ఇంద్రా, హెచ్‌ఎం రవీదర్, నరసింహ, సౌందర్యరాణి, గోపిక, చంద్రరాణి, అప్సరా తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కార్పొరేటర్ రోజాదేవి

- జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయంలో టీచర్స్‌డే నిర్వహించారు. జేఎన్‌టీయూ బీటెక్ చదువుతున్న వర్కింగ్ ప్రొఫెషనల్ కోర్సు చేస్తున్న విద్యార్థులు మెకానికల్ హెడ్ ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్ నాగశారద, రాంజీ, డాక్టర్ వసత్‌కుమార్, స్రవంతి తదితర ప్రొఫెసర్లను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నత్తనడకన అభివృద్ధి పనులు

- అధికారుల పనితీరుతో వాహనదారులకు తప్పని తిప్పలు

మియాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీప్తీశ్రీనగర్‌లో మంజీరా నీటి పైపుల ఏర్పాటు కోసం గడిచిన మూడు నెలలుగా పనులు జరుగుతున్నాయి. మరో పక్క ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శాంతి నగర్ ప్రాంతంలో రోడ్లు ఛిద్రమయ్యాయి. ఈ మరమ్మతు పనుల గురించి సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. కాగా, ఎంఎం నగర్ నుంచి దీప్తిశ్రీనగర్ వెళ్లే దారిలో వరద నీటి కాల్వల నిర్మాణం కోసం గుత్తేదారు రెండు నెలల నుంచి పనులు చేస్తున్నారు. ఈ క్రమంలోనే రోడ్డు తవ్వగా ఈ రూట్‌లో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


దీప్తి శ్రీనగర్‌లో మంజీరా నీటి పైప్‌లైన్ కోసం చేపట్టిన పనులు





శంభీపూర్‌లో ఎమ్మెల్సీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన గణేశ్ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తదితరులు



నిజాంపేట కార్పొరేషన్ పరిధిలోని మండపంలో గణనాథుడిని దర్శించుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

పార్వతీ తనయుడికి ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్‌జోన్ బృందం, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మండపాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. కొన్ని మండపాల వద్ద గురువారం కుంకుమార్చనలు, అన్న దాన కార్యక్రమాలు నిర్వహించారు.



గాజులరామారంలో శ్రీసూర్య అసోసియేషన్ వారి మండపంలో... టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ తదితరులు



కొంపల్లి ఎన్‌సీఎల్ కాలనీలోని మండపంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



కుత్బుల్లాపూర్ డివిజన్ మాణిక్యానగర్‌లో వినాయకుడి లడ్డూను లక్కీ డ్రా ద్వారా దక్కించుకున్న రాజేష్.మనోజ్



ఎంపీ ఈటలకు వినతిపత్రం అందజేస్తున్న శాలివాహన సంఘం నాయకులు

'శాలివాహన సంఘానికి స్థలం కేటాయించాలి'

దుండిగల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శాలివాహన సంఘానికి స్థలం కేటాయించాలని దుండిగల్ మున్సిపాలిటీ బీజేపీ నాయకులు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు విజ్ఞప్తి చేశారు. దుండిగల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వీసరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వారు గురువారం ఎంపీని ఆయన కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలోని సుమారు 100 కుటుంబాలు కుమ్మరి కుల వృత్తిని నమ్ముకొని జీవిస్తున్నాయని, కుండలను ఎండబెట్టి వాములో కాల్చుకోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తే, అందులో భవన నిర్మాణాలు చేపడితే కుండలను కాల్చుకునేందుకు వీలుగా ఉంటుందని ఎంపీకి వివరించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోనె మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహాచారి, కరుణాకర్‌రెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరు ఎంపిక

హైదర్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరు ఎంపికయ్యారు. ఇంగ్లీష్ బోధనలో ఉత్తమ ఫలితాలు సాధించిన రిక్షాపుల్లర్స్ కాలనీ ప్రభుత్వ పాఠశాలకు చెందిన బిజ్జం రాజిరెడ్డి, వెంకటేశ్వరనగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన గోవు నీమ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని వారు తెలిపారు.



రోడ్డు పక్కన పడి ఉన్న కేబుల్ వైర్లు

తరలింపునకు నోచుకోని కేబుల్ వైర్లు

● ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

గాజులరామారం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యుత్ స్తంభాలకు ఉన్న నెట్ కేబుల్ వైర్లను తొలగించిన అధికారులు వాటిని రోడ్డు పక్కనే కుప్పలుగా పడవేశారు. గాజుల రామారం డివిజన్‌లోని కైలాస్‌హిల్స్, మహాదేవపురం ప్రధాన రహదారి పక్కనే కేబుల్ వైర్లను కుప్పలుగా పడవేయడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు వాటి పై నుంచి వెళ్తూ జారి కిందపడిపోతున్నారు. కేబుల్ వైర్లను స్తంభాల నుంచి తొలగించి నెల రోజుల కావస్తున్నా.. ఇప్పటికీ వాటిని రోడ్డుపై నుంచి తొలగించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ప్రమాదకరంగా ఉన్న కేబుల్ వైర్లను తీసి వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఇరుకు రోడ్డుతో అవస్థలు

● ద్వారకానగర్ కమాన్ వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్

● మూలమలుపులో ప్రమాదాలు

● హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు స్థానికుల విజ్ఞప్తి



రోడ్డుపై నిలిచిన వాహనాలు

గాజులరామారం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అసలే ఇరుకు రోడ్డు.. ఆపై మూలమలుపులో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు .గాజులరామారంలోని ద్వారకానగర్ కమాన్ వద్ద ఉన్న మూలమలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. గతంలో ఇక్కడ అనేక ప్రమాదాలు జరిగాయని ద్విచక్ర వాహనదారులు చెప్తున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటోందని ద్వారకానగర్ వాసులు తెలిపారు. ప్రమాదాలు జరగకుండా ఉన్నతాధికారులు ఈ ప్రాంతంలో రోడ్డు పక్కన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

లింక్ రోడ్లతో ట్రాఫిక్ సమస్య తగ్గుముఖం

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



లింక్ రోడ్డు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

జీడిమెట్ల , సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్‌లోని సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డు నుంచి సుచిత్ర వరకు లింక్ రోడ్డు పనులను హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, లింక్ రోడ్డులను అభివృద్ధి చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. రూ.3 కోట్ల నిధులు మంజూరు కావడంతో ఈ లింక్ రోడ్డు పనులు చేపట్టేందుకు పరిశీలించామని, ఈ రెండు ప్రధాన రహదారుల నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ చాలా తగ్గుతుందని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుకుండా సాఫీగా రాకపోకలు సాగించవచ్చని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌డీసీఎల్ ఈఈ మెహబూబ్ మియా, డీఈ అరవింద్, ఏఈ శ్రీలత , బీఆర్‌ఎస్ నాయకులు, మాధవరెడ్డి, సుధాకర్‌గౌడ్, జ్ఞానేశ్వర్, నరేందర్ రెడ్డి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల తర్వాత అత్యున్నత స్థానం గురువులదే

● ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శివరాత్రి యాదగిరి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న డాక్టర్ శివరాత్రి యాదగిరి

గాజులరామారం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల తర్వాత గురువులదే గొప్ప స్థానమని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శివరాత్రి యాదగిరి అన్నారు. గాజులరామారం డివిజన్ ఉషోదయ కాలనీలోని కుత్బుల్లాపూర్ ట్రస్మా కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నేటి బాలలను రేపటి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే అత్యున్నత స్థానం గురువులదని, విద్యార్థులకు సంస్కారంతో కూడిన విద్యను అందించాలన్నారు. అనంతరం పాఠశాలల ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల విద్యాశాఖాధికారి జెమినికుమారి, ట్రస్మా మేడ్చల్ జిల్లా కోశాధికారి పరశురాం, ట్రస్మా కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షుడు కె. శ్రీనివాసాచారి, కార్యదర్శులు తిరుపతి రెడ్డి, నర్సిరెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులను తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ గౌడ్ పదో తరగతిలో మొదటి ర్యాంక్ (600/560) సాధించిన విద్యార్థులు ఎస్ కావ్య, పి.హరిచరణ్‌లకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున నగదు అందజేసి అభినందించారు. ఉపాధ్యా యులకు బహుమతులను అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రతాప్ గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులను తీర్చి దిద్దడం లో ఉపాధ్యాయులది కీలక పాత్ర అని, విద్యార్థులను ప్రోత్సహించి ఉన్నత శిఖరాలు అందుకు నేందుకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తారన్నారు.



విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతున్న కేఎం ప్రతాప్‌గౌడ్




రహదారిపై పారుతున్న మురుగు నీరు

రోడ్డును ముంచెత్తుతున్న మురుగు

● దుర్వాసనతో పాఠశాల విద్యార్థులకు అవస్థలు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పక్క వీధిలో మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు పొంగి రోడ్డుపై వర్షం నీరులా పారుతోంది. నిత్యం మురుగు పారుతుండటంతో ఆ రోడ్డుపై వెళ్లే విద్యార్థులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాఠశాల క్లాస్ రూమ్‌ల్లోకి కిటికీల నుంచి భరింప లేని దుర్వాసన వస్తోందని ఉపాధ్యాయులు, విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగు నీరు కట్టడికి చర్యలు తీసుకోవాలని స్థానికులతో పాటు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏటీఎం ముందు మెట్లపై సుమారు 60 ఏళ్ల ఓ వృద్ధుడు మృతి చెంది ఉండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాల కోసం స్థానికులను ఆరా తీయగా, అతడిని ఎవ్వరూ గుర్తించలేదు. దీంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి, పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా, మృడిని ఒంటిపై పసుపు రంగు గళ్ల చొక్కా, కాఫీ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. కుడి చేతిపై రాము, ఓం పచ్చబొట్టు ఉంది. మెడలో ఎరుపు రంగు దారం, మొలతాడు, ఎడమ చేతికి వాచ్ ఉంది. ఇతను బుధవారం రాత్రి మృతి చెంది ఉండవచ్చనని పోలీసులు భావిస్తున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికే బస్తీబాట



స్థానికులతో రవికుమార్ తదితర అధికారులు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు బస్తీ బాట నిర్వహిస్తున్నామని ఎస్ఈ రవి కుమార్ అన్నారు. కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని జయభేరి కాలనీలో ఆయన విద్యుత్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పర్యటించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలోని కాలనీలు, బస్తీల్లోని విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రావాలని, 24 గంటలూ కరెంట్ అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వారంలో మంగళ, గురు, శనివారం.. మూడు రోజులు బస్తీ బాట నిర్వహిస్తామని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విద్యుత్ సమస్యలను తమకు తెలియజేయాలని కోరారు. జయభేరిలోని ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ జాన్ పోతరాజు ఏడీ శ్రీకాంత్, ఏఈ శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భైరి ప్రశాంత్‌గౌడ్, మేడ్చల్ జిల్లా లేబర్ సెల్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, మాజీ కో-ఆప్షన్ మెంబర్ షేక్ ఇబ్రహీమ్, గోపాల్‌రెడ్డి, ఉదయ్ కుమార్, హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ జట్టుతో మర్రి లక్ష్మణ్ రెడ్డి

ఎంఎల్ఆర్ఐటీలో ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ మహిళల ఫుట్‌బాల్ జట్టు శిక్షణ శిబిరం గురువారం ఎంఎల్ఆర్ఐటీలో ముగిసింది. ఈ శిబిరంలో ప్రతిభ కనబర్చిన 20 మందిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. ఈ జట్టు 6వ తేదీ నుంచి చత్తీశ్‌గడ్‌లో జరిగే జాతీయ సీనియర్ మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగుతోంది. భారత జట్టు సభ్యురాలు జి.సౌమ్య తెలంగాణ జట్టుకు కెప్టెన్‌గా, జి.నాగరాజు కోచ్‌గా నియమితులయ్యారు. శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్ఆర్ఐటీ విద్యాసంస్థల ఛైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులను అభినందించారు. రాష్ట్రానికి ట్రోఫీతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.



మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నిమజ్జన చెరువుల పరిశీలన

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి పురపాలక సంఘంలోని వినాయక నిమజ్జన చెరువులను భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్ శివాజీరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా కన్వీనర్ శివరాజు, కో-కన్వీనర్ సతీష్ సాగర్‌లు చెరువు ప్రాంతంలో బాధ్యతలు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేసి, నిమజ్జన సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మహేందర్ సాగర్, మధు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బావ చావుకు వెళ్తే ఇల్లు గుల్ల



దొంగలు పగులకొట్టిన బీరువా

గాజులరామారం, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): బావ చావుకని ఊరుకెళ్తే దొంగలు ఇల్లును గుల్ల చేశారు. సూరారం ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకా రం.. గాజులరామారం ఆదర్శనగర్‌కు చెందిన దేవులపల్లి అంజయ్య తన బావ చనిపోడంతో ఈ నెల 1న షాద్‌నగర్ పరిధి ఇవలాపూర్ గ్రామానికి కుటుంబ సభ్యులను తీసుకొని వెళ్లాడు. అంజయ్య ఇంటి పక్కన ఉండేవారు బుధవారం అతనికి ఫోన్ చేసి మీ ఇంటి తలుపు పగులకొట్టి ఉందని చెప్పారు. దీంతో అతను ఇంటికి వచ్చి చూడగా వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. గదిలోని బీరువా పగులకొట్టి ఉంది. అందులో భద్రపరిచిన 10 తులాల వెండి, రూ. 30 వేల నగదు కనిపించలేదు. దీంతో అంజయ్య గురువారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

అన్ని విధాలా ఆదుకుంటాం

'నిమజ్జన' మృతుల కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా

దుండిగల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ గ్రామంలో మూడు రోజుల క్రితం గణేశ్ నిమజ్జనం సందర్భంగా ప్రమాదవశాత్తు చెరువు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయిన తండ్రీకొడుకులు డొక్కా శ్రీనివాస్, జాన్‌వెస్లీల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కేపీ వివేకా నంద్ గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబా నికి అన్ని విధాల అండగా ఉండి ఆదుకుంటామని చెప్పి భరోసా కల్పించారు. బాధితులను పరామర్శించిన వారిలో కృష్ణా యాదవ్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, ఆనంద్, కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, జగన్‌నాయక్, శ్రీకాంత్ యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.



గాజులరామారంలో వృథాగా పోతున్న తాగునీరు

తాగునీటి వృథాను అరికట్టాలి

షాపూర్‌నగర్, సెప్టంబర్ 4(ఆంధ్రజ్యోతి): తాగునీటి వృథాను అరికట్టడంలో అధికారులు అలసత్వాన్ని విడనాడాలని వినియోగదారులు కోరుతున్నారు. గాజులరామారం ప్రధాన రహదారిలోని ఖాజా పాన్‌షాప్ వద్ద మ్యాన్‌హోల్ పొంగి తాగునీరు వృథాగా పోతోంది. గతంలో కూడా ఇలాగే నీరు లీకేజీ అవుతుంటే అధికారులు మరమ్మతులు చేయించారు. అయితే, కొన్ని రోజులకే పరిస్థితి యథాస్థితికి చేరడంతో నీరు మళ్లీ లీకేజీ అవుతోంది తూతూ మంత్రంగా కాకుండా లీకేజీకి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ వ్యాయామంపై దృష్టి సారించాలి: సీఐ

నిజాంపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట కార్పొరేషన్ బాచుపల్లిలోని హరితవనం కాలనీలో ఏర్పాటు చేసిన ఐరన్ డీస్ట్ వ్యాయామశాలను బాచుపల్లి సీఐ సతీష్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ప్రస్తుత ఒత్తిడి జీవనం నేపథ్యంలో ఆరోగ్య పరిరక్షణ కోసం నగరవాసులు జిమ్‌ల బాటపడుతున్నారని అన్నారు. ముఖ్యంగా యువత వ్యాయామంపై దృష్టి సారించి క్రమం తప్పకుండా కసరత్తులు చేస్తూ ఆరోగ్యంతో పాటు శరీర దృఢత్వాన్ని స్థిరపర్చుకోవాలన్నారు. మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావుతో కలిసి ఈ జిమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిమ్ నిర్వాహకుడు సంతోష్‌కుమార్, సురేష్, హర్ష, వివేక్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.